(1) 05.06.2020



4-46

## మున్నుడి

బంగారు మేడలో పవళించిన శ్రీవేంకటేశ్వరుని నిద్రలేపిన చెలియలు, ఆ పురుషోత్తమునికి సుగంధద్రవ్యాలతో నలుగుబెట్టి, పన్నీటితో స్నానం చేయించి, చక్కగా విసరి, కర్పూర ధూళిమెత్తి, కొప్పు దువ్వి, గొజ్జెంగపూలు ముడిచి, అనేక సొమ్ములు బెట్టి, తాంబూలమిచ్చి, తులసి మాలలు వేసి, ఆరగింపులు చేసి ఎలా సేవిస్తున్నారో చెబుతున్నారు అన్నమాచార్యులవారు.

సీ॥ బంగారు మేడలో పరమాత్ముడే వాడు
చెలులు సింగారాలు చేయరేల
తట్టు పుణుగు నూనె దట్టంబుగా నించి
కస్తూరి బాగుగా కలియబెట్టి
పన్నీట మజ్జనం బెన్నంగ సేయించి
వెట్టదీరగ వాన్కి వీవరేల?
కర్పూర గంధంబు కదు నిట్టె మెత్తరే
కొప్పులో ముడువరే 'గొజ్జెగలను'

తే॥ మేన సొమ్ములు నించరే మిలమిలయన
తులసిదండలు వేయరే నిలువుగాను
ఆరగింపులు సేయరే, అన్నమయ్య
పాట వినిపించి వేంకటపతికినిపుడు

రాగం : మధ్యమావతి

బంగారు మేడలలోన పరమాత్ముడు వాడే
సింగారాలు మీద మీద సేయరే చెలులు ॥బంగారు॥

తట్టుపుణుగుల నూనె తలనిండా నంటుకొని
గట్టిగా కస్తూరి అట కలివెట్టి
మట్టులేని పన్నీట మజ్జన మాడె నిదె
వెట్టదీర నిందరును విసరరే చెలులు ॥బంగారు॥



Scanned with CamScanner

కప్పురంపు గందవొడి కడునిట్టె మెత్తుకొని
కొప్పు దువ్వి ముడిచెను గొజ్జంగలెల్లా
తెప్పలుగా నించుకొనె తిరుమేను సొమ్ములెల్లా
దప్పిదీర విడమీరే తలకొని చెలులు ॥బంగారు॥

అలమేలుమంగను వురమందు నిట్టెనించుకొని
తులసి దండలు మోచె నిలువునను
చెలరేగి ఆరగించె శ్రీవేంకటేశ్వరుడు
కొలువున్నాడు మోహాలు గుప్పరే చెలులు ॥బంగారు॥

**భావామృతం :**

ఓ చెలులారా! అతగాడు బంగారపు మేడలో నివసించు, పురుషోత్తముడైన శ్రీవేంకటేశ్వరుడు. వానికి ఒకదానిని మించిన దింకొకటియైన అలంకరణలు చేయండి.

ఆ స్వామి తలకి (శిరోజములకు) తట్టు పుణుగు నూనెను (పునుగు పిల్లినుంచి వచ్చిన సుగంధపు నూనె) తలనిండా అంటి కస్తూరితో బాగుగా కలియబెట్టి, నలుగువలె బెట్టి స్వామికి ఆపై పన్నీటితో స్నానం చేయించండి. స్నానమైన తరువాత ఆయనకు వెట్టదీర (వేడిమి తగ్గిపోవునట్లు) మీరింతమంది చెలులు ఆయనకు వింజామరలతో విసరండి.

ఆ తరువాత ఎక్కువ కర్పూర ధూళితో ఆయనకు మెత్తి ఒళ్ళంతా సుగంధం వచ్చేట్లు చేయండి. ఆపైన ఆయన కొప్పును చక్కగా దువ్వి, 'గొజ్జంగలు' (గొజ్జగ పుష్పములు) ఆ కొప్పులో ముడిచి అలంకరించండి. అప్పుడా స్వామి పవిత్రమైన తన శరీరంపై సొమ్ములు (ఆభరణములు) తెప్పలుగా (ప్రోవుగా) ధరించి మిలమిల మెఱసి పోయాడు. ఓ చెలులారా! మీరింత హడావిడి చేస్తుంటే ఆయనకి దప్పికతో నోరెండిపోతుంది. అట్లాకాకుండా మీరు పూనుకొని కర్పూర తాంబూలమియ్యండి.

ఓ చెలులారా! తన హృదయంపై అలమేల్మంగను పెట్టుకొనిన ఆ శ్రీవేంకటేశ్వరుడు, గుబాళించు తులసి మాలలను తన మెడలో నిలువుగా ధరించాడు. ఆపై విజృంభించి తనకి నివేదించిన పదార్థములనారగించి కొలువు దీరియున్నాడు. మీకు ఆయనపైగల మోహమునంతా గుప్పించి "శ్రీవేంకటేశ చరణం శరణం ప్రపద్యే..." అని శరణాగతి నొందండి. తరించండి. మీపై దయతో ఆయన మీకిచ్చిన మానవజన్మను సార్థకం చేసికోండి.



Scanned with CamScanner

② 05.06.2020



## మున్నుడి

శ్రీవేంకటేశ్వరుని పట్టపురాణి అలమేల్మంగపై అన్నమాచార్యుల వారు చెప్పిన అద్భుత కీర్తన ఇది. పరమాత్మ దేవేరి, బ్రహ్మయ్యను కన్నతల్లి, చంద్రుని తోబుట్టువు, క్షీరసాగర కన్య అసంఖ్యాకమైన వేంకటపతి బంట్లకు ఇహము పరము ఇచ్చే తల్లిని కాస్తమాబోటి భూలోకంలోని నిర్భాగ్యులని కూడా విచారించు తల్లీ! అని వేడుకొంటున్నారు. శ్రీమహాలక్ష్మి సిరులనిచ్చే తల్లియే, కాని మనం అంతా గమనించాల్సిన విషయం ఏమంటే "నీమగని పంపునను నిజసిరులిచ్చితివి" అంటున్నారు. స్వామి తలపూపితేకాని అమ్మ మనకేసి చూడదు. అదీ సంగతి.

**చం॥ కమలకు, విష్ణురాణికిని, కాముని తల్లికి, కామధేనుతో
విమలపు జన్మనెత్తిన పవిత్రకు మొక్కిరి అన్నమార్యుడున్
రమ యని పేరునొందిన లలామకు వేంకటనాధుడే తగున్
అమరుల కన్నతల్లికిది అద్భుత కీర్తన మెంచి చూడరో**

**రాగం : శుద్ధధన్యాసి**

పరమాత్ముడైన హరి పట్టపు రాణివి నీవు
ధర మమ్ము విచారించదగు నీకు నమ్మా ॥పరమాత్మ॥

కనులజు గన్నతల్లి కాముని గన్నతల్లి
అమరుల గన్నతల్లి ఆదిమ లక్ష్మి
విమలపు నీపతికి విన్నపము సేసి మమ్ము
నెమకి యేలితి దయ నీకే తగునమ్మా ॥పరమాత్మ॥

కామధేను తోబుట్టుగ కల్పకము తోబుట్టుగ
దోమటి చల్లని చంద్రు తోబుట్టుగ
నీ మగని పంపునను నిజసిరులిచ్చితివి
నేమపు వితరణము నీకే తగునమ్మా ॥పరమాత్మ॥



Scanned with CamScanner

పాలజలధి కన్యవు పద్మాసనివి నీవు
పాల పండే వేంకటపతి దేవివి
యేలిన ఇతని బంట్లకు ఇహపరాలిచ్చి మా
పాలగలిగితివి సంబంధము మేలమ్మా ॥పరమాత్మ॥

భావామృతం :

పరమాత్మునిగా సన్నుతింపబడుచున్న శ్రీహరికి పట్టపురాణివి తల్లీ! నీవు. ఆయన యేలుబడిలో వున్న ఈ భూమిపై నున్న మమ్ము రక్షించి మా బాగోగులు చూడవలసిన అమ్మవు నీవే.

నీకు నీవేమన్నా తక్కువా తల్లీ? నీవెవరివో తెలుసా? స్వయంగా చతుర్ముఖ బ్రహ్మగారి కన్నతల్లివి. భావనలోనే పుట్టి అలరించే కాముడు(మన్మధుని) అమ్మగారివి. దేవతలందరికి జననివి. ఆదిలక్ష్మివి. నిర్మలుడైన నీమగని కాస్త మాకొరకు అభ్యర్థించి మేం యెక్కడ వున్నా వెదకి పట్టుకొని దయచూపించమని చెప్పగల దానివి నీవొక్కదానివే. నీకే తగును. కాస్త దయచూడు తల్లీ!

ఇక నీ సోదరులు యెంత గొప్పవారో తెలుసునా తల్లీ! కామధేనువు అందరి కోరికలను తీర్చే సంగతి జగత్ప్రసిద్ధమే. కల్పకము (కల్పవృక్షం) యెక్కడ వుంటే అక్కడ కొఱతయే వుండదు. చంద్రుడు చల్లని చందమామయ్యేగాక, దోమటి (అన్నము) పెట్టే సస్యదాత. నీ మగడు అంగీకరిస్తేనే మాకు నిజమైన సౌభాగ్యములనిచ్చెదవు. అందుకని 'ఈవి' (దానగుణం) మీ వంశంలోనే వున్నది. కాస్తమాపై కూడ నీదయ చూపించు తల్లీ!

నీవు క్షీరసాగరకన్యవు. కమల నివాసినివి. పాలపండే (నైపుణ్యంగల) వేంకటేశ్వరుని దేవేరివి. ఆ స్వామి బంట్లము అయినందువల్ల మా యేలిక ప్రోద్బలమున మాకు ఇహము పరమునిచ్చే యజమానురాలివి. అందుచే నీవు మా పాలినుండు సంబంధముచే మమ్ము పరిపాలించి రక్షించు తల్లీ!



Scanned with CamScanner